క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నందిగామ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని ముక్కపాటి నగర్ లో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాలు నిండిన ప్రీ స్కూల్ చిన్నారులకు వార్డు కౌన్సిలర్ విశ్వనాథపల్లి వాణి సర్టిఫికెట్లను అందజేశారు. మండలంలోని అంబారుపేట, ఐతవరం గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఐతవరం గ్రామ సర్పంచ్ నాయుడు ఉదయలక్ష్మి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో లచ్చపాలెం వీఆర్‌ఏ మృతి



గోపి (ఫైల్)

నందిగామ: గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి చెందిన ఘటన నందిగామలో జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం మండలంలోని లచ్చపాలెం వీఆర్‌ఏగా పనిచేస్తున్న బింగి గోపీకృష్ణ(41) శుక్రవారం రాత్రి యథావిధిగా నిద్రించారు. నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ నరసింహారావు శనివారం గోపీకృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు రెవెన్యూ సిబ్బంది కూడా గోపీ మృతదేహానికి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు

నందిగామ: రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలైన ఘటన శనివారం నందిగామ పట్టణంలో జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులను వ్యాన్‌లో ఇంటికి తీసుకు వెళుతుండగా ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఒక మహిళతో పాటు పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ హనీష్ తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

నందిగామ (చందర్లపాడు): మండలంలోని కొత్తపాలెం గ్రామంలో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏకం ఫౌండేషన్ (యూఎస్‌ఏ), ఆసరా ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు వాసిరెడ్డి వంశీ తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామంలోని పలు ప్రాంతాల్లో 400 మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు కూడా చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు చింతోటి ప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పరీక్ష

జగ్గయ్యపేటఅర్బన్: డాక్టర్ వైఎస్సార్ కడప జిల్లాలోని క్రీడా పాఠశాలలో 4, 5 వ తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 18 వ తేదీన జగ్గయ్యపేటలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో ఎంపిక పరీక్ష జరుగుతుందని ఎంఈవో రవీంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు జరిగే ఎంపిక పరీక్షకు ఆసక్తి కలిగిన విద్యార్థులకు శారీరక దృఢ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. 4 వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులకు 8 ఏళ్ల వయస్సు పూర్తయి ఉండాలని, 5 వ తరగతిలో ప్రవేశం కోసం 9 ఏళ్లు పూర్తయి ఉండాలని తెలిపారు. వివరాలకు పేట ఎంఈవో సెల్ నంబరు 99495 10617 లో సంప్రదించాలని కోరారు.

పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ కష్టాలు

- అమ్మవారి దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- శుక్ర, ఆదివారాల్లో వందలాది వాహనాల రాక
- ఇరుకు రోడ్లతో ప్రయాణికుల అవస్థలు



పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ కష్టాలు



ఆలయం చుట్టూ వాహనాల పార్కింగ్(ఫైల్)

పెనుగంచిప్రోలు: గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ప్రతి శుక్ర, ఆదివారాల్లో భక్తులు పోటెత్తుతున్నారు. ఆయా రోజుల్లో గ్రామానికి వేలాది వాహనాలు తరలి రావటంతో పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం పెద్ద నగరాన్ని తలపిస్తోంది. ఆంధ్రా నుంచే కాక తెలంగాణ నుంచి కూడా వందలాది వాహనాల్లో భక్తులు తరలి వస్తున్నారు. వాహనాల రద్దీతో గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. తిరునాళ్ల సమయంలో ఇరుకు రోడ్లతో భక్తులు పడరాని పాట్లు పడుతున్నారు.

ఇరుకు రోడ్లే కారణం...

గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలి పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో రోడ్లు ఇరుకు కావటంతో ట్రాఫిక్ కష్టాలు మరింత పెరుగుతున్నాయి. ముఖ్యంగా భక్తులు కాజ్‌వే పైనుంచి మునేరు అవతల మామిడి తోటల్లోకి వెళ్లి వంటలు చేసుకుని భోజనాలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ రోడ్డు మొత్తం కుంచించుకుపోయింది. రోడ్డుకు రెండు వైపులా వ్యాపారాలు చేసుకునేవారు రోడ్డు మీదకు దుకాణాలు పొడిగించటంతో వాహనాలు వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు. ముఖ్యంగా కాజ్‌వే వైపు వెళ్లే దారిలో మూల మలుపులో డ్రైనేజీ దాటి దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి శ్రీ తిరుపతమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారి కూడా బాగా ఇరుకుగా ఉండటంతో బస్సు వస్తే ఎదురుగా బైక్ కూడా వెళ్లే పరిస్థితి లేదు. శుక్ర, ఆదివారాల్లో ఆలయానికి వందల సంఖ్యలో కార్లు, బైక్‌లు ఇతర వాహనాలు వస్తున్నాయి. ఆలయం వద్ద కూడా వాహనాలకు పార్కింగ్ స్థలం సరిపోవటం లేదు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి అభివృద్ధి చేయటంతో పాటు తక్షణం భక్తుల రద్దీ రోజుల్లో వన్‌వే ఏర్పాటు చేస్తే బాగుంటుందని అంటున్నారు.

వన్‌వే పై దృష్టి పెడతాం



భక్తుల రద్దీ దృష్ట్యా పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో శుక్ర, ఆదివారాల్లో ట్రాఫిక్‌పై ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. వన్‌వే విషయం కూడా ఆలోచిస్తాం. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలపై దృష్టి పెట్టి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తాం. శుక్ర, ఆదివారాల్లో విజబుల్ పోలీసింగ్ కూడా చేస్తున్నాం.

–సీహెచ్‌కే దుర్గాప్రసాద్, ఎస్‌ఐ

గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కంచికచర్లలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: గ్రామాల్లో ప్రజల సమస్యలు ముందుగా తెలుసుకుని వారి పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్లలో హెచ్‌పీ గ్యాస్ కంపెనీ రోడ్డు నుంచి అంబేడ్కర్ నగర్‌కు వెళ్లే అంతర్గత రోడ్డును సీసీ రోడ్డుగా మార్చేందుకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మండల పరిషత్ నుంచి రూ.8 లక్షల నిధులు కేటాయించామని, ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తుందని ఆ నిధులతో ఇప్పటికే సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులను తొలగించామని, అవసరమైన కాలనీలలో ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని ప్రజలకు సరఫరా చేశామన్నారు. కంచికచర్ల పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో చేపట్టిన మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచి వేల్పుల సునీత, ఉప సర్పంచి వేమా సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, మాడుగుల మధుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, మార్త శ్రీనివాసరావు, చింతా రవీంద్రనాథ్, ఎంపీడీఓ బాలశంకరరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పోటీతత్వం పెంచడానికే జగనన్న ఆణిముత్యాలు

జయంతి(వీరులపాడు): విద్యావ్యవస్థలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలకటంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని జయంతి గ్రామంలో 10వ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం ఆమె గ్రామ నాయకులతో కలిసి సత్కరించారు. వారికి నగదు ప్రోత్సాహకాలు కూడా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించటంతో పాటు ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కమల పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే ఉదయభాను



యోషితను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: ఇటీవల విడుదలయిన నీట్ 2023 పరీక్ష ఫలితాలలో 539 మార్కులు సాధించిన బనావత్ యోషితను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శనివారం అభినందించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యోషితకు జ్ఞాపికతో పాటు రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ వత్సవాయి మండలం, గోపినేనిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని యోషిత స్థానిక వాగ్దేవి మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో బైపీసీ పూర్తిచేసుకొని 950 మార్కులు సాధించిందని, నీట్‌లో 539 మార్కులు సాధించడం గర్వకారణమని ప్రశంసించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ బుస్సా సురేష్ పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్



కంచికచర్ల జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులను సత్కరించి మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రశాంతి

కంచికచర్ల: విద్యావ్యవస్థను బలోపేతం చేయటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన చేస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యలో నాణ్యత, విద్యా రంగంలో సంస్కరణలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమ ప్రభుత్వమన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో విద్యా రంగానికి పెద్దపీట వేసి విద్యార్థులకు భరోసా కల్పిస్తున్నారని అన్నారు. నాడు -నేడు పథకంలో భాగంగా పాఠశాలల రూపురేఖలను మార్చి విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించారన్నారు. పాఠశాలలు తెరిచిన రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశామన్నారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, ఉప సర్పంచి వేమా సురేష్ బాబు, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ ద్వారా రూ.2.13 కోట్లు మంజూరు



కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ

కంచికచర్ల: జలజీవన్ మిషన్ ద్వారా అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందజేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీ(వీడబ్ల్యూఎస్‌సీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచికచర్ల మండలం గండేపల్లి, పరిటాల, కంచికచర్ల గ్రామాలకు జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.2.13 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆ నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం, పైప్‌లైన్, ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, మంగునూరు కొండారెడ్డి, కంచికచర్ల, పరిటాల, గండేపల్లి సర్పంచులు వేల్పుల సునీత, యద్దనపూడి ఆనందజ్యోత్స్న, బొక్కా రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు కర్ల రాధిక, పిల్లి భాగ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామలింగప్రసాద్, డీఈఈ కె.రవి కుమార్, ఏఈ సాయిశ్రీలక్ష్మి, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరవ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన



వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

నందిగామ: పట్టణ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణ పరిధిలోని ఆరవ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా దోమల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్, ఎబేట్ ద్రావణం పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ యాకూబ్ అలీ, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాథం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణమే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



చెరువు బజారులో వంతెన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న చెర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రాధాన్యతా క్రమంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటుచేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని 17 వ వార్డు పెద్ద రామాలయం పరిసర ప్రాంతాలలో సుమారు రూ.5.22 లక్షలతో నూతనంగా ఏర్పాటుచేస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. అనంతరం చెరువు బజారులో చెరువు అలుగు వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు కాలంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సూచనల మేరకు పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వర రావు, వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, తన్నీరు నాగేంద్ర, దువ్వల రామకృష్ణ, డీఈ శివ కోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సకాలంలో పూర్తిచేయాలి

ఆర్డీవో రవీంద్రరావు



సమావేశంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: డివిజన్ పరిధిలో జరుగుతున్న రీ సర్వే పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆర్డీఓ రవీంద్రరావు సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం సాయంత్రం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్వే సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. స్పందన ద్వారా వచ్చే అర్జీలను పరిశీలించి వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో సిబ్బంది అవినీతికి పాల్పడకుండా సేవలందించాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

వీరులపాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు వైద్యాధికారులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుఖ ప్రసవాలు జరిగే విధంగా చూడాలన్నారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో గర్భిణులను గుర్తించి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కలిగించాలని తెలిపారు. ముఖ్యంగా వైద్యారోగ్య కేంద్రాలకు వచ్చే రోగులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఆమె సూచించారు. నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని, సిబ్బంది కూడా అందుకనుగుణంగా ముందుకు సాగాలని తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే సూచించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మారపాక మహాలక్ష్మి, కన్నమాల సురేష్‌బాబు, వైద్యాధికారి దీపిక తదితరులు పాల్గొన్నారు.

పుష్కరిణి పనుల పరిశీలన



పుష్కరిణి వద్ద జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న ఈవో సీతారామయ్య

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన కోనేరు పుష్కరిణి వద్ద జరుగుతున్న ఆక్రమణల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. పుష్కరిణి వద్ద జరుగుతున్న పనులను శనివారం ఆలయ ఈవో సీతారామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

ప్రభుత్వ విప్ ఉదయభాను



ఉదయభానును కలిసి మొక్కను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ అనుబంధ విభాగాలలో నూతనంగా నియమితులైన నాయకులు సమర్థంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి పాటుపడాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన నందిగామ నియోజకవర్గానికి చెందిన ఆవుల విజయ్, ఉపాధ్యక్షునిగా నియమితులైన షేర్‌మహ్మద్‌పేటకు చెందిన మోరె వినోద్, ఏలూరు శివాజీ శనివారం ఎమ్మెల్యే ఉదయభానును పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయభాను వారిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను ప్రతి గడపకు తెలియజేయాల్సిన గురుతర బాధ్యత ప్రచార విభాగం కమిటీలకు ఉందన్నారు. ఆ విధంగా కష్టపడి పనిచేస్తూ పార్టీ విజయానికి దోహదపడాలని సూచించారు.

చైర్‌పర్సన్ తీరు బాధాకరం

విలేకరుల సమావేశంలో కౌన్సిల్ సభ్యులు

నందిగామటౌన్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండా చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని వైస్ చైర్‌పర్సన్ మాడుగుల నాగరత్నం, పలువురు కౌన్సిల్ సభ్యులు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి పార్టీ నాయకులతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషనర్‌తో వ్యక్తిగత ద్వేషంతో చైర్‌పర్సన్ కౌన్సిల్ సమావేశానికి హాజరుకాకపోవటంతో చేసేది లేక కౌన్సిల్ సభ్యులమంతా కలిసి వైస్ చైర్‌పర్సన్ మాడుగుల నాగరత్నం అధ్యక్షతన సమావేశం నిర్వహించి అజెండాలోని అంశాలకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు మారం అమరయ్య, షేక్ ఖాలిక్, షేక్ యాకుబ్ అలీ, మందా మరియమ్మ, బాపట్ల సాంబయ్య, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, పాములపాటి రమేష్, బండారు వెంకట్రావ్, బండారు శేషు పాల్గొన్నారు.